క్లుప్తంగా

రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలి

రాజోళి: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి విజయ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు రైతులు కల్లాలో ఆరబెట్టుకున్న మిరప, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు తడిసిపోయాయని పేర్కొన్నారు. బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నేడు కేంద్ర బృందం రాక

మానవపాడు: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం నేషనల్ క్వాలిటీ అసోరెన్స్ స్టాండర్ బృందం సందర్శిస్తారని డాక్టర్ ఇర్షాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోగ్య కేంద్రంలో కేంద్ర బృందం పరిసరాలను, గదులను, ఔషధాలను పరిశీలిస్తారని పేర్కొన్నారు.

యాపర్లకు బస్సు సర్వీస్ నడపాలి



పెబ్బేరు: మండల పరిధిలోని యాపర్లకి ఆర్టీసీ బస్సు నడపాలని గ్రామస్తులు వనపర్తి ఆర్టీసీ ఆర్ఎంకు ఆదివారం వినతి అందజేశారు. ఈ సందర్భంగా యాపర్ల, గుమ్మడం, గుమ్మడం తండా గ్రామాలకు గతంలో ఆర్టీసీ బస్సులు వస్తున్నాయి. ప్రస్తుతం బస్సులు రాకపోకలు లేకపోవడంతో పరీక్షలు రాసేందుకు విద్యార్థులు, పాఠశాలలకు వచ్చే ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పట్టణ కేంద్రానికి రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి బస్సును ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో సీతారాంనాయక్, అరుణ్, శంకర్, కిరణ్, శివ, శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఉచిత వైద్యసేవలు



అమరచింత: తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యసదుపాయాలు పొందవచ్చని సీఎస్సీ సెంటర్ నిర్వాహకులు పృథ్వీనాగలింగేశ్వర్ తెలిపారు. పట్టణంలోని రజక వీధిలో రజక కులస్తులకు ఆదివారం ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా కార్డు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించారు. భారత ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న పథకానికి ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అన్ని చేతివృత్తుల వారితో పాటు తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యేందర్, డ్రైవర్ శ్రీనివాసులు, సవరన్న, శ్రీనివాసులు, చిన్న రాజ పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్ ఏఆర్‌కు అటాచ్

వనపర్తి క్రైం: ఓ కేసు విషయంలో జరిగిన పంచాయితీలో జోక్యం చేసుకున్నారని హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను వనపర్తి ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. వనపర్తి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మన్యపురెడ్డి, కానిస్టేబుల్ నవీన్‌గౌడ్ ఓ కేసు విషయంలో పెద్ద మనుషుల మధ్య జరిగిన పంచాయితీలో జోక్యం చేసుకున్నారని.. అందులో ఓ బాధితురాలు ఎస్పీ ఫిర్యాదు చేయడంతో వారిద్దరని వనపర్తి ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆమె విధులపై నిర్లక్ష్యం వహించే వారికి మెమోలు జారీ చేస్తున్నారు.

చిన్నారెడ్డి పరామర్శ

వనపర్తిటౌన్: ఎదిగి వచ్చిన యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి చనిపోవడం బాధాకరమని మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని 3వ వార్డుకు చెందిన బాలకృష్ణ రోడ్డు ప్రమాదంలో గాయపడి చనిపోవడంతో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి ఆదివారం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. చిన్నారెడ్డి వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ్‌చందర్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నిరంజన్

పాన్‌గల్: కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ నూతన అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఎండీ నిరంజన్‌ను నియమించారు. నియామక పత్రాన్ని ఆదివారం రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సిరాజొద్దీన్ చేతుల మీదుగా అందుకున్నట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన కొల్లాపూర్ టౌన్ అధ్యక్షుడు బాలపీర్, పార్టీ సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్షాద్, నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరి తోడ్పాటుతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు

- సెంట్రల్ లైటింగ్ పనులు షురూ
- రూ.5.50 కోట్ల నిధుల మంజూరు



అయిజలో కొనసాగుతున్న సెంట్రల్ లైటింగ్ సిస్టం పనులు

అయిజ: పట్టణాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. మండల కేంద్రాలలో ఉన్న రోడ్లను విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ప్రణాళికా ప్రకారం ముందుకెళ్తోంది. దీనికి అవసరమైన నిధులు కేటాయించి పనులు ముమ్మరం చేసేందుకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పనుల్లో నాణ్యత లోపించకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా పట్టణంలో సుందరీకరణకు మున్సిపల్ అధికారులు ప్రణాళికను రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. పట్టణం అభివృద్ధికి రూ.5.50 కోట్లు విడుదల చేసింది. పట్టణంలోని పాతబస్టాండ్ సర్కిల్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు, కొత్తబస్టాండ్ నుంచి రాయచూర్-కర్నూల్ రోడ్డు సర్కిల్ వరకు రోడ్డును 100 అడుగుల విస్తీర్ణంచేసి, మధ్యలో డివైడర్ నిర్మించి, సెంట్రల్ లైటింగ్‌కు నిధులు కేటాయించారు. గత సంవత్సరం పనులు ప్రారంభమయ్యాయి. ఏడాదిపాటు పనులు నత్తనడకన సాగినా ప్రస్తుతం ఊపందుకున్నాయి.

కాంతులీననున్న ప్రధాన రోడ్డు

సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తయితే ప్రధానరోడ్డు కాంతులీననుంది. పనులు త్వరగా పూర్తిచేసేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. నిధులు మంజూరు కావడంతో పనులు వేగవంతం చేస్తున్నారు. ప్రధాన రోడ్డు కొత్త శోభను సంతరించుకోనుంది.

పనులు వేగవంతం చేయాలి



పట్టణంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు, రోడ్డు వెడల్పు పనులను వేగవంతం చేయాలి. సింగిల్ లేయర్ రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యాయి. డబుల్ లేయర్ పనులతో పాటు సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను పూర్తి చేయాలి.ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలి.

– వెంకటేష్, అయిజ

సూచిక బోర్డులు లేక..



రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సింగిల్ లేయర్ పనులు పూర్తి అయ్యాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తొలగాయి. రోడ్డును దాటే ప్రదేశాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలి. రోడ్డు పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– తిమ్మారెడ్డి, అయిజ

పర్యవేక్షిస్తున్నాం

సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సింగిల్ లేయర్ రోడ్డును ఇదివరకే నిర్మించాం. సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తిచేసి డబుల్ లేయర్ రోడ్డు నిర్మాణం కూడా త్వరలో పూర్తిచేస్తాం. రోడ్డు డివైడర్ మధ్య మొక్కలు పెంచి పట్టణాన్ని సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

– నర్సయ్య, మున్సిపల్ కమిషనర్

అకాల వర్షాలతో రైతులు ఆగమాగం



బూరెడ్డిపల్లి శివారులో నేలకొరిగిన మునగ చెట్లు

ధరూరు: రెండు రోజులుగా కురిసిన అకాలవర్షాలకు అన్నదాతలు అతలాకుతలం అయ్యారు. వరి, ఆముదం పంటలతో పాటు టమాట, మునక్కాయలు, మామిడి రైతులు నష్టపోయారు. లక్షల పెట్టుబడులు పెట్టి సాగు చేసుకున్న తోటలు కళ్ల ముందే పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని జాంపల్లి, మార్లబీడు, ర్యాలంపాడు, కోతులగిద్ద, ధరూరు, బూరెడ్డిపల్లి, చిన్నపాడు తదితర గ్రామాల శివారు పొలాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. బూరెడ్డిపల్లిలో రైతు ఆనంద్‌రెడ్డి పొలంలో ఆరున్నర ఎకరాల్లో సాగు చేసిన మునగకాయల చెట్లు పూర్తిగా నేలకొరిగాయి. ధరూరు, ర్యాలంపాడు గ్రామాల శివారుల్లో ఇటుకల బట్టీలు పూర్తిగా తడిసిపోయాయి. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

రైతుల అక్రమ అరెస్ట్ అప్రజాస్వామ్యం



మాట్లాడుతున్న ఆలూరు ప్రకాష్ గౌడ్

గద్వాల అర్బన్: చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను రద్దు చేయాలని కోరుతూ 425 రోజులుగా నిరసనలు, దీక్షలు చేస్తున్న రైతులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, టీజేఎస్ జిల్లా కన్వీనర్ ఆలూరు ప్రకాష్ గౌడ్, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గంజిపేట రాములు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయా పార్టీల కార్యాలయాల్లో వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. రైతులకు ఎలాంటి ప్రయోజనం లేని రిజర్వాయర్‌ను వెంటనే రద్దు చేయాలని చిన్నోనిపల్లి, బోయిలగూడెం, ఇందువాసి, చాగదోన, లింగాపురం రైతులు దీక్షలు చేపడుతుంటే అర్ధరాత్రి వేళ పోలీసులు గ్రామాల్లో వెళ్లి ప్రజలను భయాభ్రాంతులకు గురి చేస్తూ అక్రమంగా అరెస్టు చేసి, రిజర్వాయర్ పనులను పునఃప్రారంభించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామాల్లో 300 మంది పోలీసులు మోహరించి భయానక వాతావరణం సృష్టించారని వాపోయారు. వెంటనే అరెస్టు చేసిన రైతులను బేషరతుగా విడుదల చేసి, రిజర్వాయర్ పనులను నిలిపివేయాలని, రైతుల భూములు రైతులకే అప్పగించాలని డిమాండ్ చేశారు.

అంగరంగ వైభవంగా..

- మంగంపేటలో ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం
- జెడ్పీచైర్‌పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి ప్రత్యేక పూజలు



మంగంపేటలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు



ఆలయంలో పూజలు చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత దంపతులు

మల్దకల్: వేదపండితుల మంత్రోచ్ఛరణలు.. వేలాదిగా తరలివచ్చిన భక్తజనం నడుమ అంగరంగ వైభవంగా ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం సాగింది. ఆదివారం మండలంలోని మంగంపేటలో పునర్నిర్మాణం చేపట్టిన ఆంజనేయస్వామి, శివాలయాల్లో విగ్రహాలైన గణపతి, శివలింగం, పార్వతి, నందీశ్వరుడు, నవగ్రహములు, శిఖరం, బొడ్రాయి, ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు వేదపండితులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి, శ్రావణ్ గ్రామంలోని సుంకులమ్మ, తాయమ్మ, లింగమయ్య, వీరభద్రస్వామి, కుమారస్వామి నాగదేవత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. జెడ్పీచైర్‌పర్సన్ సరిత, గద్వాల మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహారెడ్డి వేర్వేరుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, సర్పంచు జయమ్మ, బీఆర్ఎస్ నాయకులు పెద్దవీరన్న, పెద్ద గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు రామాంజనేయులు, బండల వెంకట్రాములు, మురళీధర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



అయిజ: మండలంలోని చిన్న తాండ్రపాడులో సత్యమాంబ కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఉగాది పండుగను పురస్కరించుకొని మండల స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం కర్నూలు జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్ కిశోర్‌కుమార్ హాజరై రిబ్బన్ కట్‌చేసి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

వనపర్తి క్రైం: వనపర్తి నియోజకవర్గంలో స్థానిక మంత్రి ఒంటెద్దు పోకడలు, అవినీతి పాలన నచ్చక సొంత పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌కి రాజీనామాలు చేసినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ అన్నారు. ఆదివారం వనపర్తి మండలం అచ్యుతాపురంలో యువ నాయకుడు గాంధీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చెరువుల సుందరీకరణ, ట్యాంక్‌బండ్ పేరుతో టెండర్లకు తిలోదకాలిచ్చి రూ.కోట్లు ప్రజాధనం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి, కృష్ణ, అధికార ప్రతినిధి శ్రీశైలం, ఆర్.వెంకటేశ్వర్ రెడ్డి, పెద్దిరాజు ఉన్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్



నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: చిన్నోనిపల్లి రిజర్వాయర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రైతులకు మద్దతు తెలిపేందుకు బీజేపీ నాయకులు తరలివెళ్తుంటే ఆదివారం అంతపల్లి గ్రామం వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పనుల్లో భాగంగా వల్లూరు, మల్లమ్మ కుంట, జులకల్ రిజర్వాయర్‌లను నిర్మించకుండా అవసరం లేని చిన్నోనిపల్ల రిజర్వాయర్‌ను పనులు చేపట్టడం దారుణమన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కృష్ణారెడ్డి, గట్టు మండల అధ్యక్షుడు శివారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యం కోసమే పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న రంజిత్‌కుమార్

గట్టు/కేటీదొడ్డి: ప్రజా చైతన్యం కోసమే నడిగడ్డ ఆత్మగౌరవం కోసం పాదయాత్ర చేస్తున్నట్లు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. పాదయాత్రలో భాగంగా మూడో రోజు ఆదివారం మండల కేంద్రంతో పాటు సల్కాపురం, రాయాపురం గ్రామాల మీదుగా కేటీదొడ్డి మండలంలోని మండలంలోని మల్లాపురం తండా సిద్దోనిపల్లి తండాలో కొనసాగింది. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేదలను చైతన్యం కావాలని సూచించారు. గద్వాల కోటపై బహుజన జెండాను ఎగురవేద్దామన్నారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, లవన్న, వీరేష, నాగేష్, రంగస్వామి, పరుశరాముడు, బలరాం, దయాకర్, నరేష్, నర్సింహులు, హనుమంతు, వెంకట్రాములు, జమ్మన్న, రఘుపతి, మల్దకల్, మహ్మద్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గద్వాల మండల నూతన కమిటీని ఆదివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా అశోక్, ప్రధాన కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా శరత్, ఉపాధ్యక్షులు దిలీప్, భాస్కర్, పాల్, ప్రచార కార్యదర్శులు ప్రవీణ్, రేపల్లే కృష్ణ, జాయింట్ సెక్రెటరీ నితిన్, ప్రవీణ్ లు ఎన్నికయ్యారు. ముఖ్య అతిథులుగా వక్తలు వేమన్న, దేవప్ప, వాల్మీకిలు హాజరై మాట్లాడారు. అంబేద్కర్ చూసిన బాటలో నడవాలని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అంతకు ముందు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు భీమేష్, రమేష్, మహేష్, దయాకర్, సునీత్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ద్రోహం చేస్తున్న కేంద్రం

మదనాపురం: వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులను కేంద్ర ప్రభుత్వం ద్రోహం చేస్తుందని చలో ఢిల్లీ మజ్దూర్ కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని కార్మికులు పిలుపునిచ్చారు. ఆదివారం మదనాపురం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన సదస్సులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ప్రభుత్వం ఈ తొమ్మిది సంవత్సరాల్లో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలపై భారాలు మోపుతూ కార్పొరేట్ మతోన్మాద అనుకూల విధానాలను, రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని మండిపడ్డారు. ఈ విధానాలను ప్రజాస్వామ్య వాదులంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు అయినటువంటి ఎల్ఐసీ, రైల్వే, తపాలా, విశాఖ ఉక్కు, బ్యాంకులను పెట్టుబడిదారులకు కారుచౌకగా కట్టబెడుతున్నారన్నారు. పేదల నిత్యావసర సరుకుల ధరలు ఆకాశానంటాయని, పెట్రోల్, డీజిల్ ధరలు తొమ్మిదేళ్ల కింద రూ.55 నుంచి రూ.60 ఉండగా.. ప్రస్తుతం రూ.110కు చేరిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి, ఎస్ రాజు, బొబ్బిలి నిక్సన్, ఏ బుచ్చన్న, వెంకటరాములు, చెన్నయ్య, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు



చల్లాతో అలంపూర్ నియోజకవర్గ నాయకులు

అలంపూర్: ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని కర్నూల్‌లోని ఆయన నివాసంలో కర్నూల్ జిల్లా కోడుమూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చల్లాకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని ఇటిక్యాల, అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు, అయిజ మండలాలకు చెందిన నాయకులతోపాటు వనపర్తి జిల్లాలోని పెబ్బేరు మండలానికి చెందిన పలువురు కార్యకర్తలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు చల్లాను కలిసి సన్మానించారు.

అలంపూర్: ఎమ్మెల్సీగా ఎన్నికైన చల్లా వెంకట్రామిరెడ్డిని పీఆర్‌టీయూ నాయకులు కర్నూల్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఆయా మండలాల అధ్యక్షులు చల్లాను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కారుపాకుల, ఆర్. గార్లపాడు గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డిని ఆదివారం కర్నూల్ పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, పెద్ద భీముడు, కుమ్మరి రాముడు, ఖాజ, కృష్ణ, తిమ్మారెడ్డి, కాంతారెడ్డి, గోపిరెడ్డి, వెంకటన్న, మద్దిలేటి, వెంకట్రామిరెడ్డి, శ్రీను, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

అధికారుల అలసత్వం

- మండల కేంద్రంలో కాలిన వంద విద్యుత్ మీటర్లు



కాలిన పంచాయతీ మీటర్



మండల కేంద్రంలో కాలిన మీటర్

ధరూరు: అసలే వేళాపాలా లేకుండా వస్తున్న విద్యుత్.. ఆపై కరెంటు వచ్చినా ఏ సమయంలో ఎంత వస్తుందో తెలియదు.. కరెంటు హెచ్చు తగ్గులతో ఇళ్లల్లో ఉన్న విలువైన వస్తువులు, పరికరాలు కాలి బూడిదవుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. వినియోగదారుల నుంచి బిల్లులు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కాని వినియోగదారులకు సేవలు అందించడంలో అలసత్వం వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నారు. ఇళ్లముందు ఆటోల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలని లేనిపక్షంలో విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని నిర్వహిస్తున్న ప్రచారాలపై ఉన్న శ్రద్ధ కాలిన మీటర్ల స్థానంలో కొత్తవి ఎందుకు బిగించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక నెల బిల్లు చెల్లింపు ఆలస్యమైనా విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు నిద్రమత్తు వీడటం లేదు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వివిధ సభలలో విద్యుత్ శాఖ అధికారుల గురించి మాట్లాడటం సమయం వృథా.. అధికారుల తీరుపై బహిరంగంగా ఎన్నోసార్లు అసంతృప్తి వ్యక్తం చేసిన సంఘటనలు ఉన్నాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇదీ సమస్య..

మండలంలోని ఉప్పేరు, గార్లపాడు తదితర గ్రామాలతో పాటు మండల కేంద్రంలో ప్రతి రెండు, మూడు నెలలకు ఒక సారి విద్యుత్ సరఫరాలో హెచ్చు, తగ్గులు ఏర్పడి హై ఓల్టేజీ కారణంగా ఇళ్లల్లో విలువైన వస్తువులు కాలిపోతున్నాయి. మండల కేంద్రంలోనే ఆరు నెలల కిందట దాదాపు 100 మీటర్లు ఒకేసారి కాలిపోయాయి. అప్పటి వరకు నెలకు రూ.200లకు మించి విద్యుత్ బిల్లులు రాలేదు. ప్రస్తుతం మీటర్లు లేని కారణంగా ప్రతి నెలా మినిమం చార్జెస్ పేరుతో రూ.500 లు ముక్కుపిండి వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

వివిధ కాలనీలలో..

స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి పాత ఎంఆర్ఓ కార్యాలయం, ఎస్సీ కాలనీ(హైస్కూల్ పక్కన), చాకలి వీధి, ముస్లిం కాలనీల్లో 100కు పైగా మీటర్లు కాలిపోయాయి. వాటి స్థానంలో కొత్త మీటర్లు బిగించాల్సి ఉండగా అవేవి పట్టించుకోకుండా నెల నెలా బిల్లులను వసూలు చేస్తున్నారు. అడిగినా పట్టించుకునే నాథులే లేరంటూ విద్యుత్ వినియోగదారులు ఆ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త మీటర్లు బిగిస్తాం

వచ్చే నెలలో కాలిన మీటర్ల స్థానంలో కొత్త మీటర్లు బిగిస్తాం. వినియోగదారుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం. ట్రాన్స్‌కోపై చర్యలు తీసుకుంటాం. కొత్త మీటర్లు వచ్చే వరకు వినియోగదారులు సహకరించాలి.

–నాగరాజు, ఏఈ